# రామకృష్ణ సంఘంలో చేరేందుకు తరచుగా అడిగే ప్రశ్నలు

*శ్రీరామకృష్ణ పరమహంస మరియు స్వామి వివేకానందల స్ఫూర్తిదాయకమైన జీవితాలను, సందేశాలను చదివి చాలామంది యువత ప్రేరణ పొందుతున్నారు. వారు రామకృష్ణ సంఘంలో చేరి, సన్న్యాస జీవితం గడపాలని అభిలషిస్తున్నారు. మరికొంతమంది యువత, యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాలలో వేదాంతం గురించిన ఉత్తేజపూర్వక ఉపన్యాసాలు వినడం ద్వారా ప్రేరణ పొంది, సన్న్యసించాలని కోరుకుంటున్నారు. లౌకిక ఉన్నతుల పట్ల, ఈ ప్రపంచంలోని సంబంధ బాంధవ్యాల పట్ల విరక్తి కూడా కొంతమందిని మఠం వైపు నడిపిస్తోంది. మరికొందరు, రామకృష్ణ సంఘ సన్న్యాసులు నిస్వార్థంగా చేస్తున్న సేవా కార్యక్రమాలకు ప్రభావితులై, తాము కూడా అందుకు అంకితమవ్వాలని కోరుకుంటున్నారు. ప్రేరణ ఏదైనా సరే, రామకృష్ణ సంఘంలో సన్న్యాస జీవితం గడపాలనుకునేవారు ముందుగా కొన్ని విషయాలను జాగ్రత్తగా పర్యాలోచించాలి. అలాంటి ఉదాత్తమైన ఆశయం కలవారు సరైన అవగాహనతో నిర్ణయం తీసుకోవాలి. ఆ వివరాలన్నీ ప్రశ్నలు-సమాధానాల రూపంలో సంక్షిప్తంగా ఈ క్రింద వివరించబడ్డాయి.*

**1. రామకృష్ణ సంఘం అంటే ఏమిటి?**

ఈ సందర్భంలో సంఘం అంటే, ఒకే లక్ష్యానికి కట్టుబడిన సన్న్యాసులు సమూహంగా జీవించడం! రామకృష్ణ సంఘం అనేది ఒక వ్యవస్థీకృత సన్న్యాసుల సంస్థ. దీనికి ఆదిమూలం శ్రీరామకృష్ణులు మరియు ఆయన ప్రత్యక్ష సన్న్యాస శిష్యులు, ముఖ్యంగా స్వామి వివేకానంద! ఇక్కడ శ్రీ శారదాదేవిని గురించి తప్పక ప్రస్తావించాలి. ఆమె ఆధ్యాత్మికోన్నతి శ్రీరామకృష్ణుల ఆధ్యాత్మికోన్నతికి సమానమైనది. రామకృష్ణ సంఘం ఆవిర్భవించినప్పటి నుండి సుమారు మూడు దశాబ్దాల పాటు, ఆమె తన మాతృప్రేమతోనూ, ఆధ్యాత్మిక ఉపదేశంతోనూ ఈ సంఘానికి మార్గదర్శనం చేశారు. అందుచేత, ఆమెను రామకృష్ణ సంఘం యొక్క దివ్యజననిగా పేర్కొంటారు.

కార్యాచరణ పరంగా, రామకృష్ణ సంఘం అనేది "రామకృష్ణ మఠం" మరియు "రామకృష్ణ మిషన్" అని ప్రత్యేకంగా రిజిస్టర్ చేయబడిన రెండు సంస్థలు. వీటి ప్రధాన కార్యాలయాలు పశ్చిమ బెంగాల్‌లోని బేలూరు మఠంలో ఉన్నాయి. ఈ సంఘానికి ప్రపంచవ్యాప్తంగా 200కు పైగా శాఖలున్నాయి. ఈ రెండు సంస్థల చరిత్ర, ఆశయం మరియు కార్యకలాపాల గురించి మరింత తెలుసుకోవడానికి మా వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

**2. 'రామకృష్ణ సంఘంలో చేరడం' అంటే ఏమిటి?**

రామకృష్ణ సంఘంలో చేరడం అంటే, కుటుంబాన్ని, స్నేహితులను, వృత్తిని, సంపదలను, అన్ని లౌకిక ఆసక్తులను, సుఖాలను మరియు సంబంధాలను త్యజించి సన్న్యాస జీవితాన్ని స్వీకరించడం! ఆ వ్యక్తి ఇకపై రామకృష్ణ సంఘానికి చెందిన ఏదైనా మఠం లేదా ఆశ్రమంలో నివసిస్తూ, తన జీవితాన్ని ఆధ్యాత్మిక అన్వేషణకు మరియు నిస్వార్థ సేవకు అంకితం చేస్తాడు.

**3. రామకృష్ణ సంఘంలో సన్న్యాసి కావడానికి అర్హతలు ఏమిటి?**

ఆసక్తి గల యువకులు (గమనిక: కేవలం పురుషులు మాత్రమే) కనీసం గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, 18 నుంచి 28 ఏళ్ళమధ్య వయస్సు కలిగి ఉండాలి. ఇంజినీరింగ్ లేదా వైద్య విభాగాలలో గ్రాడ్యుయేషన్/పోస్ట్-గ్రాడ్యుయేషన్ చేసినవారికి గరిష్ఠ వయస్సు 30 సంవత్సరాలు. పాశ్చాత్యులకు గరిష్ఠ వయస్సు 36 సంవత్సరాలు. మరిన్ని వివరాల కోసం, దయచేసి బేలూరు మఠంలోని ప్రధాన కార్యాలయాన్ని ఈ-మెయిల్ <mail@rkmm.org> ద్వారా సంప్రతించగలరు.

**4. సన్న్యాస జీవితాన్ని స్వీకరించాలనుకునే యువతులకు గల అవకాశాలు ఏమిటి?**

రామకృష్ణ సంఘం కేవలం సన్న్యాసులకు (పురుషులకు)మాత్రమే ఉద్దేశించినది. అయితే, మహిళల కోసం, రామకృష్ణ సంఘం వంటి ఆశయాలను అనుసరించే ఒక స్వతంత్ర సంస్థ ఉంది. అదే '*శ్రీ శారదా మఠం*'. సన్న్యాస జీవితంపై ఆసక్తి ఉన్న యువతులు కోల్‌కతాలోని దక్షిణేశ్వరంలో గల 'శ్రీ శారదా మఠం' ప్రధాన కార్యాలయాన్ని నేరుగా సంప్రదించవచ్చు. ఈ-మెయిల్ <saradamath.office@gmail.com>

**5. నాకు వివాహమైంది, నేను రామకృష్ణ సంఘంలో చేరవచ్చా?**

క్షమించండి! రామకృష్ణ సంఘంలో చేరడానికి వివాహం కాని పురుషులు మాత్రమే అర్హులు. వివాహమై విడాకులు తీసుకున్నవారు కూడా అర్హులు కారు.

అయితే, ఒక భక్తునిగానో, స్వచ్ఛంద సేవకునిగానో మాతో (మఠం లేదా మిషన్‌తో) అనుబంధం ఏర్పరచుకోవడానికి మీకు స్వాగతం. దీనికి సంబంధించి మరింత సమాచారం కోసం, మీ దగ్గరలోని మా శాఖా కేంద్ర అధ్యక్షులు / కార్యదర్శిని సంప్రతించగలరు.

**6. అన్నింటినీ త్యజించాలనుకున్న వ్యక్తికి విద్యార్హత ఎందుకు?**

ఆధ్యాత్మిక పురోగతికి విద్యార్హత తప్పనిసరి కానప్పటికీ, ఈ క్రింది కారణాల వల్ల అది అవసరం.

అ) సన్న్యాస జీవితాన్ని ఎంచుకోవడం అనేది జీవితంలో అత్యంత కీలకమైన నిర్ణయం. ఈ నిర్ణయం తీసుకోవాలంటే ఒక నిర్దిష్ట స్థాయి మానసిక పరిపక్వత అవసరం. వ్యావహారిక విద్య ఇతరత్రా అంశాలతో పాటు, ఈ పరిణతిని పొందేందుకు కూడా సహాయపడుతుంది.

ఆ) రామకృష్ణ సంఘ సన్న్యాసులు పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు వంటి అనేక సేవాసంస్థలను నిర్వహించాల్సి ఉంటుంది. అలాగే, వారు జాతీయ లేదా అంతర్జాతీయ వేదికలు, విశ్వవిద్యాలయాలలో ప్రసంగించేందుకు ఆహ్వానించబడతారు. ఈ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడానికి మంచి విద్యార్హత సహాయపడుతుంది.

ఇ) కొందరు యువకులు లౌకిక వైఫల్యాల కారణంగా సన్న్యాస జీవితాన్ని ఎంచుకుంటుంటారు. బహుశా వారు చదువులకు, పరీక్షలకు భయపడి కావచ్చు, లేదా చదువులో ప్రతిభ లేని కారణంగా కోరుకున్న ఉద్యోగం రాకపోవటం వల్ల కావచ్చు. కాబట్టి విద్యార్హత మరియు వయోపరిమితిని నియమం చేసి, అటువంటివారు రామకృష్ణ సంఘంలోకి ప్రవేశించకుండా నిరోధించడమే మా ఉద్దేశం.

**7. నేను కళాశాల/విశ్వవిద్యాలయ విద్యార్థిని. నేను ఇప్పుడే రామకృష్ణ సంఘంలో చేరవచ్చా?**

మీరు మొదలుపెట్టిన కోర్సును లేదా డిగ్రీని తప్పనిసరిగా పూర్తి చేయండి. ఆ తరువాత మీరు సంఘంలో చేరవచ్చు. మీ వైరాగ్యానికి మీ చదువును మొదటి బలి కానివ్వకండి.

మీ చదువు పూర్తయ్యేవరకు, తీరిక సమయాలలో మీకు దగ్గరలోని మా మఠ/మిషన్ శాఖలో వాలంటీర్‌గా స్వచ్ఛంద సేవలో పాల్గొనవచ్చు.

**8. రామకృష్ణ సంఘంలో చేరిన తర్వాత నేను ఉన్నత చదువులు కొనసాగించడానికి అవకాశం ఉందా?**

సాధారణంగా, మఠంలో చేరదలచుకున్నవారు ముందుగానే తమ విద్యను పూర్తి చేసి ఉండాలి.

**9. నాకు కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నాయి. నేను రామకృష్ణ సంఘంలో చేరడానికి అవి ప్రతిబంధకమా?**

సన్న్యాసి ఇతరులను సేవించాలి గానీ తాను సేవలు చేయించుకోకూడదు కాబట్టి, రామకృష్ణ సంఘంలో చేరడానికి మంచి ఆరోగ్యం చాలా అవసరం. అందువల్ల, సంఘంలో చేరే ప్రక్రియలో భాగంగా, అభ్యర్థులు తమ శారీరక సామర్థ్యాన్ని నిరూపించుకోవడానికి తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలి. దీర్ఘకాలిక లేదా తీవ్రమైన శారీరక, మానసిక అనారోగ్యాలు ఉన్నవారిని సంఘంలో చేర్చుకోరు. ఎందుకంటే, వారు సన్న్యాస జీవితంలోని కష్టాలను భరించలేక, సంఘానికి భారంగా మారే అవకాశం ఉంటుంది.

**10. నేను శ్రీరామకృష్ణులు, స్వామి వివేకానందల గురించిన సాహిత్యాన్ని చదవలేదు. మరి సంఘంలో చేరవచ్చా?**

అలాంటప్పుడు మీరు వెంటనే రామకృష్ణ సంఘంలో చేరడం సముచితం కాదు. దయచేసి ముందుగా రామకృష్ణ – వివేకానంద సాహిత్యానికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన పుస్తకాలను చదవడానికి తగినంత సమయాన్ని వెచ్చించండి.

**11. నేను వేదాంతాన్ని లోతుగా అధ్యయనం చేయాలనుకుంటున్నాను. సంఘంలో చేరిన తర్వాత అది నాకు సాధ్యమవుతుందా?**

సాధ్యమవుతుంది. భగవద్గీత, ఉపనిషత్తులు వంటి వేదాంత గ్రంథాలను అధ్యయనం చేయడానికి రామకృష్ణ సంఘంలో

అనేక అవకాశాలు ఉన్నాయి. సంఘంలో చేరిన మూడు సంవత్సరాల తర్వాత ప్రతి బ్రహ్మచారి, బేలూరు మఠంలోని బ్రహ్మచారుల ప్రశిక్షణ కేంద్రం (ప్రొబేషనర్స్ ట్రైనింగ్ సెంటర్ – టిసి)లో రెండు సంవత్సరాల విస్తృతమైన అధ్యయన కార్యక్రమాన్ని తప్పనిసరిగా పూర్తి చేయాలి. అక్కడ వేదాంతంతో పాటు అనేక ధార్మిక విషయాలు బోధించబడతాయి.

శ్రీరామకృష్ణులు, శ్రీశారదాదేవి, స్వామి వివేకానంద మరియు శ్రీరామకృష్ణుల ఇతర ప్రత్యక్ష సన్న్యాస శిష్యుల జీవితాలు, బోధనలు స్వయంగా వేదాంతమే! ఎందుకంటే, వారు వేదాంత సత్యాలను తమ జీవితాలలో సాక్షాత్కరించుకొని, వాటికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. అందువల్ల, మా సన్న్యాసులు కేవలం పాండిత్యం కోసం కాకుండా, వేదాంత సత్యాలపై దృఢవిశ్వాసం మరియు ఆ సత్యాలను సాక్షాత్కరించుకోవడమే లక్ష్యంగా శాస్త్రాధ్యయనం చేయాలని చెబుతాం. అందుకు తగిన విధంగా, బ్రహ్మచారుల ప్రశిక్షణ కేంద్రంలోనూ, రామకృష్ణ సంఘం మొత్తంలో కూడా సన్న్యాసుల ఆధ్యాత్మిక అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిచ్చే విధంగా జీవన శైలి రూపొందించబడింది.

**12. నేను జన్మతః హిందువును కాను. అయినా రామకృష్ణ సంఘంలో చేరవచ్చా?**

అది ఏమాత్రం సమస్య కాదు. రామకృష్ణ సంఘం అన్ని మతాలు, అన్ని జాతీయతలు మరియు సమస్త జాతుల ప్రజలకు స్వాగతం పలుకుతుంది. అయితే, వారు త్యాగ భావనతో పవిత్రమైన జీవితాన్ని గడపడానికి సిద్ధంగా ఉండాలి. శ్రీరామకృష్ణుల ఆదర్శాలలో ప్రధానంగా, 'అన్ని మతాలు ఒకే పరమ లక్ష్యానికి దారి తీస్తాయి' మరియు 'మానవ సేవయే మాధవ సేవ' అన్న ఆదర్శాలను మనస్ఫూర్తిగా స్వీకరించాలి.

**13. నేను కృష్ణ (లేదా శివ, కాళీ, క్రీస్తు లేదా ఇతర దైవం) భక్తుడిని. నేను రామకృష్ణ సంఘంలో చేరవచ్చా?**

మీకు స్వాగతం! మీకు శ్రీరామకృష్ణుల పట్ల గౌరవభావం మరియు ఆయన బోధనలలోని సత్యాల పట్ల విశ్వాసం ఉంటే, తప్పకుండా సంఘంలో చేరవచ్చు.

**14. నేను నా దేశానికి, ముఖ్యంగా నిరుపేదలకు మరియు నిస్సహాయులకు సేవ చేయడానికి రామకృష్ణ సంఘంలో చేరవచ్చా?**

మీ సేవాదృక్పథాన్ని మరింత విశాలం చేసుకోవాలనుకుంటున్నట్లయితే తప్పకుండా చేరవచ్చు. ఇతర స్వచ్ఛంద సంస్థల (ఎన్జీవోస్) లాగా రామకృష్ణ సంఘం కేవలం సామాజిక సేవ చేసే సంస్థ కాదు. మా నినాదం 'ఆత్మనో మోక్షార్థం జగత్ హితాయ చ' (స్వీయ ముక్తి మరియు లోక హితం కొరకు). దీనిని స్వామి వివేకానంద స్వయంగా ఇచ్చారు. ఆధ్యాత్మికతయే ఈ సంఘానికి ఆధారం, మార్గనిర్దేశిక శక్తి మరియు అంతిమ లక్ష్యం. మా సన్న్యాసులు సేవా కార్యక్రమాలను తమ ఆధ్యాత్మిక సాధనలో ఒక భాగంగా పరిగణిస్తారు. కాబట్టి, కేవలం దయగల హృదయం లేదా దేశభక్తి మాత్రమే కాకుండా, సంఘంలో కొనసాగడానికి ఈ ఆధ్యాత్మిక దృక్పథం అనివార్యం.

**15. నేను సన్న్యాస జీవితాన్ని స్వీకరించాలనుకుంటున్నాను. కానీ, మా తల్లితండ్రులు వ్యతిరేకిస్తున్నారు. నేనేం చేయాలి?**

సంఘంలో చేరడానికి తల్లితండ్రుల సమ్మతి పొందడం అత్యంత అవసరమైనప్పటికీ, మీరు యుక్తవయస్సువారే కాబట్టి ఇది తప్పనిసరి కాదు. చాలా అరుదుగా మాత్రమే తల్లిదండ్రులు తమ కుమారుడు సన్న్యాస జీవితం స్వీకరించడాన్ని ప్రోత్సహిస్తారు. అభ్యర్థులు చాలామంది తమ తల్లిదండ్రుల వ్యతిరేకతను, కొన్నిసార్లు వారి తీవ్ర కోపాన్నీ ఎదుర్కోవలసి వస్తుంది. అయితే, మీరు ఏవిధమైన బాధ్యతను తప్పించుకొనేందుకు కాకుండా, లౌకిక సుఖాల పట్ల నిజమైన విముఖతతోనే ఈ జీవితాన్ని ఎంచుకుంటున్నారన్న దృఢనిశ్చయంతో ఉంటే, ఏదీ మిమ్మల్ని నిలువరించదు. పైగా, కొంతకాలం తరువాత చాలామంది తల్లితండ్రులు తమ కుమారుడి ఉన్నత నిర్ణయానికి హర్షించి, గర్వపడతారనేది కూడా వాస్తవం.

సన్న్యాసం అనేది ఒక ప్రాచీనమైన, ఉన్నతమైన వ్యవస్థ. దీనికి శాస్త్రాల ఆధారం ఉంది. కాబట్టి సన్న్యసించాలనే అభిలాష ఉన్నవారు ప్రతికూల పరిస్థితుల మధ్య ధైర్యంగా ఉండాలి. "యదహరేవ విరజేత్ తదహరేవ ప్రవ్రజేత్ – ఎప్పుడైతే వైరాగ్యం కలుగుతుందో, అప్పుడే ప్రపంచాన్ని త్యజించాలి" అని జాబాలోపనిషత్తు చెబుతోంది.

**16. సంఘంలో చేరిన తర్వాత కూడా నేను మా తల్లిదండ్రులు, బంధువులతో సంబంధాలు కొనసాగించవచ్చా?**

ప్రారంభ దశలో, అవసరమైతే తల్లిదండ్రులతో మాట్లాడటానికి, వారి యోగక్షేమాలు తెలుసుకోవడానికి అనుమతి ఉంటుంది. అయితే, సన్న్యాసులు తమ పూర్వపు సంబంధాలను తప్పనిసరిగా వదిలివేయాలి. ఇది తక్షణమే అందరికీ

సాధ్యమయ్యే విషయం కాదు. కాబట్టి, లౌకిక సంబంధాలన్నింటినీ క్రమేణా దూరం చేసుకోవడం ద్వారా వైరాగ్య భావనను పెంపొందించుకోవాలి.

**17. నా పేరున కొంత ఆస్తి ఉంది. నేను రామకృష్ణ సంఘంలో చేరితే దాని పరిస్థితి ఏమిటి?**

సన్న్యాసి అంటేనే ఏమీ లేనివాడని అర్థం. ఈ విషయంలో శాస్త్రాలు మరియు చట్టపరమైన నిర్వచనాలు రెండూ ఏకాభిప్రాయంతో ఉన్నాయి. మీరు రామకృష్ణ సంఘంలో చేరడానికి ముందు లేదా చేరిన తరువాత వీలైనంత త్వరగా మీ పేరున ఉన్న స్థిర చరాస్తులు అన్నింటినీ, మీ అభిమతం మేరకు విక్రయించి సర్దుబాటు చేయాలి.

**18. రామకృష్ణ సంఘంలో నాకు జీతం చెల్లిస్తారా?**

లేదు. సన్న్యాస ధర్మానికి అది విరుద్ధం కాబట్టి, రామకృష్ణ సంఘంలో సన్న్యాసులకు జీతం చెల్లించబడదు. సన్న్యాస జీవితం అనేది భౌతిక లాభాన్ని ఆశించి చేసే ఉద్యోగం కాదు. ఇక్కడ మీ శరీరాన్ని, మనస్సును, ప్రతిభను మరియు సామర్థ్యాలను ఎలాంటి భౌతిక ప్రతిఫలం ఆశించకుండా పూర్తి స్వచ్ఛందంగా సమర్పిస్తారు.

**19. సంఘంలో చేరితే, నా వ్యక్తిగత అవసరాలను ఎవరు తీరుస్తారు? వృద్ధాప్యంలో నన్నెవరు చూసుకుంటారు?**

సన్న్యాస జీవితాన్ని స్వీకరించడం అంటే, ప్రతి విషయంలోనూ సంపూర్ణంగా భగవంతుడిపై ఆధారపడటం! అయినా, ఈ విషయంలో మీరు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. సంఘం మీ సంరక్షణ చేపట్టి, మీకు అన్ని విధాలా సహాయపడుతుంది.

**20. సంఘంలో చేరిన తర్వాత నేను ఏవిధమైన దుస్తులను ధరించాలి?**

సంఘంలోని సభ్యులు సాధారణంగా కుర్తా (కాలర్ లేని వదులుగా ఉండే చొక్కా), ధోవతీ (నడుము చుట్టూ కట్టి, పాదాల వరకు ఉండే వస్త్రం) మరియు ఉత్తరీయం (చొక్కా చుట్టూ కప్పుకొనే వస్త్రం) ధరిస్తారు. ఈ పద్ధతిని అనుసరించి, ప్రారంభ దశలో ఉన్న బ్రహ్మచారులు తెలుపు రంగు దుస్తులను, సన్న్యాస దీక్ష అయినవారు కాషాయ రంగు దుస్తులను ధరిస్తారు.

**21. నేను రేపు సంఘంలో చేరితే, పూర్తిస్థాయి సన్న్యాసిగా మారడానికి ఎంతకాలం పడుతుంది?**

సాధారణంగా తొమ్మిది సంవత్సరాలు పడుతుంది. ఒక అభ్యర్థి తనను తుది సన్న్యాస దీక్షకు సమాయత్తం చేసుకోవడానికి కేటాయించబడిన సమయం ఇది. సన్న్యాసం స్వీకరించిన తరువాత పేరు చివరలో 'ఆనంద' అని, పేరు మొదట్లో 'స్వామి' అని ఇవ్వబడుతుంది.

**22. రామకృష్ణ సంఘంలో చేరిన తరువాత నేను అనుసరించాల్సిన విధానం ఏమిటి?**

రామకృష్ణ సంఘంలో చేరిన తరువాత, మీ పూర్తి జీవితాన్ని 'ఆత్మనో మోక్షార్థం జగత్ హితాయ చ – స్వీయ ముక్తి మరియు లోక హితం కొరకు' అనే రెండు ఆదర్శాలకు అంకితం చేయాలి. ఆజన్మాంతం మీరు ఆధ్యాత్మిక సాధనలలో మరియు నిష్కామ సేవలో నిమగ్నమై ఉండాలి. ఆధ్యాత్మిక సాధనలు అంటే... జపం, ధ్యానం, ప్రార్థన, పూజ, స్తోత్ర పారాయణం, భజనలు పాడటం, పవిత్ర గ్రంథాల అధ్యయనం మరియు ఇతర ఆధ్యాత్మిక సాధనలు ఆచరించడం. ఇందులో, రోజువారీ జపం మరియు ధ్యానం అత్యంత ముఖ్యమైనవి. వీటిలో కొన్ని సాధనలను స్వయంగా, మరికొన్నింటిని ఆశ్రమంలోని సోదర సన్న్యాసులతో కలసి చేయాలి. మీరు ఈ సాధనలతోపాటు, అంతే ఉత్సాహంతో మరియు నిజాయితీతో నిస్వార్థ సేవలో కూడా పాల్గొంటారు. తద్వారా మా సంస్థ యొక్క సేవా కార్యక్రమాలలో మీ వంతు పాత్ర పోషిస్తారు. మీరు మఠం కోసం లేదా ప్రజల కోసం చేసే ఏ పనైనా పూజ్యభావంతో చేయాలి. అప్పుడు మీకు అది కూడా ఒక ఆధ్యాత్మిక సాధన అవుతుంది.

మీరు ఈ విధంగా జీవితాన్ని గడపడం ద్వారా, పవిత్రత, భక్తి, వైరాగ్యం, నిస్వార్థత, సత్యసంధత మరియు బ్రహ్మచర్యం వంటి సాధు లక్షణాలను సంతరించుకొని భగవత్ సాక్షాత్కారం పొందుతారు.

**23. రామకృష్ణ సంఘంలో అనుసరించే ఆధ్యాత్మిక సాధన ఏమిటి?**

ఇక్కడ కర్మయోగం, భక్తియోగం, రాజయోగం మరియు జ్ఞానయోగం అనే నాలుగు యోగాల సమన్వయాన్ని అనుసరిస్తారు.

ఈ విధానం వల్ల సర్వతోముఖ వ్యక్తిత్వ వికాసం సాధ్యపడుతుంది. నిజానికి, ఎవరైనా ఈ సంఘంలోని జీవన విధానాన్ని (మునుపటి ప్రశ్నకు సమాధానంలో వివరించిన విధంగా) అచంచలమైన విశ్వాసం మరియు గౌరవంతో అనుసరిస్తే, వారిలో ఈ నాలుగు యోగాల సమన్వయం సహజంగానే జరుగుతుంది. స్వామి వివేకానంద రూపొందించిన రామకృష్ణ సంఘ చిహ్నంలో ఈ నాలుగు యోగాల సమన్వయం అద్భుతంగా చిత్రీకరించబడింది. మా చిహ్నం గురించి ఇక్కడ వివరించబడింది.

**24. నేను బ్రహ్మచర్య జీవితం గురించి మరింత తెలుసుకోవాలనుకుంటున్నాను. దాని గురించి ఏవైనా మార్గదర్శకాలు లేదా చదవదగిన రచనలు ఉన్నాయా?**

బ్రహ్మచర్యంపై స్వామి వివేకానంద బోధనల నుండి సంకలనం చేయబడినవి ఇక్కడ అందుబాటులో ఉన్నాయి.

అదేవిధంగా, ఈ క్రింద పేర్కొన్న రెండు పుస్తకాలలో ఉపయోగకరమైన మార్గదర్శకాలు లభిస్తాయి:

* *'యువతా! మేల్కోండి! మీ శక్తిని తెలుసుకోండి'* అనే పుస్తకంలో 'బ్రహ్మచర్యం వల్ల కలిగే శక్తి' అనే అధ్యాయం – రచయిత: స్వామి శ్రీకాంతానంద.

* *'Spiritual Practice'* అనే పుస్తకంలో 'బ్రహ్మచర్యం' అనే అధ్యాయం – రచయిత: స్వామి అశోకానంద.

**25. నేను సంఘంలో చేరిన తర్వాత, ఆధ్యాత్మికంగా మార్గనిర్దేశం చేసేవారెవరైనా అందుబాటులో ఉంటారా?**

అవును, ఉంటారు. సంఘంలోని వరిష్ఠ సన్న్యాసులను ఆశ్రయిస్తే, సన్న్యాస జీవితంలోని ప్రతి అంశంలోనూ వారు మీకు మార్గనిర్దేశం చేస్తారు. అంతేకాకుండా, మీరు సరైన మార్గంలోనే పయనిస్తున్నారో, లేదో వారు మిమ్మల్ని పర్యవేక్షిస్తూ ఉంటారు.

**26. నేను ఇంతవరకు మంత్రదీక్ష తీసుకోలేదు. నేను ఏమి చేయాలి?**

మంత్రదీక్ష అంటే, ఆధ్యాత్మిక సాధకుడు గురువు ద్వారా మంత్రాన్ని పొందే ఒక విశేషమైన కార్యం. ఇందులో గురువు సాధకునికి మంత్రాన్ని, అంటే భగవంతుని పవిత్ర నామాన్ని ఉపదేశిస్తారు. ఆ మంత్రాన్ని ఎలా జపించాలో (జప విధానం), అలాగే ధ్యానం (ఉపాసన) ఎలా చేయాలో కూడా గురువు బోధిస్తారు. రామకృష్ణ సంఘంలో కేవలం సర్వాధ్యక్షులు మరియు ఉపాధ్యక్ష స్వామీజీలు మాత్రమే మంత్రదీక్షను ఇస్తారు. ఒకవేళ మీరు వీరెవరి నుంచీ మంత్రదీక్ష పొందనట్లయితే, సంఘంలో చేరిన కొద్ది కాలానికి అందుకోసం తగిన ఏర్పాట్లు చేయబడతాయి.

**27. నేను రామకృష్ణ సంఘంలోని ఏ శాఖలోనైనా చేరవచ్చా?**

కొన్నింటిని మినహాయిస్తే, విదేశాలలో ఉన్న వాటితో సహా మా శాఖలన్నీ కొత్తవారిని చేర్చుకుంటాయి.

మీరు బేలూరు మఠంలో కూడా చేరవచ్చు. కొత్తవారికి ఇక్కడ ప్రీ–ప్రొబేషనర్ శిక్షణా కేంద్రం (పిపిటిసి) ఉంది.

కానీ, ఇంతకుముందు చెప్పినట్లుగా, మీరు ఎక్కడ చేరినా, బేలూరు మఠంలోని బ్రహ్మచారుల ప్రశిక్షణా కేంద్రం (టిసి)లో రెండు సంవత్సరాలు గడిపే అవకాశం తప్పకుండా దొరుకుతుంది.

**28. బేలూరు మఠంలో చేరడంలో ఉన్న ప్రత్యేకత ఏమిటి?**

బేలూరు మఠం రామకృష్ణ సంఘానికి కేంద్ర స్థానం. ఇక్కడే మా ప్రధాన మఠం నెలకొని ఉంది. ఇది మా సంఘ ప్రధాన కార్యాలయం కూడా! స్వామి వివేకానంద మరియు శ్రీరామకృష్ణుల ప్రత్యక్ష సన్న్యాస శిష్యులలో కొందరు ఇక్కడ నివసించారు. ఈ పవిత్ర ఆధ్యాత్మిక అనుబంధాల వల్ల, చాలామంది తమ సన్న్యాస జీవితాన్ని ఇక్కడే ఆరంభించాలని ఆశిస్తారు. నూతనంగా చేరిన వారికి ప్రీ–ప్రొబేషనర్ శిక్షణా కేంద్రం (పిపిటిసి)లో ఆరు నుంచి పన్నెండు నెలలు శిక్షణనిచ్చిన తరువాత, వారిని ఇతర శాఖా కేంద్రాలకు పంపిస్తారు.

**29. మా పరిసరాల్లో ఒక రామకృష్ణ ఆశ్రమం ఉంది. నేను అక్కడ చేరవచ్చా?**

శ్రీరామకృష్ణ లేదా స్వామి వివేకానంద పేరు కలిగి ఉన్న ఆశ్రమాలన్నీ మా శాఖలు కావు. కాబట్టి, మీరు ప్రస్తావించిన ఆశ్రమం మా గుర్తింపు పొందినదో, కాదో నిర్ధారించుకోండి. మా అధికారిక శాఖల వివరాలు మా వెబ్‌సైట్ <belurmath.org> లో ఉన్నాయి.

**30.** ప్రత్యేకించి మీ శాఖలలో ఒకటి నాకు నచ్చింది. నా జీవితాంతం సన్న్యాసిగా అక్కడే కొనసాగవచ్చా?

మీరు చేరిన శాఖలో గరిష్ఠంగా మూడు సంవత్సరాల వరకు కొనసాగవచ్చు. ఆ తర్వాత, మిమ్మల్ని ఏ శాఖకు పంపించాలనేది బేలూరు మఠంలోని వరిష్ఠ సన్న్యాసుల (మా ప్రధాన కార్యాలయం) నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.

ఒకే శాఖలో జీవితమంతా గడపాలని కోరుకోవడం సన్న్యాస స్ఫూర్తికి విరుద్ధం. మీరు ఎంచుకున్న శాఖలో చేరి, అక్కడ మూడు సంవత్సరాల వరకు ఉండవచ్చు. ఆ తర్వాత, బేలూరు మఠంలోని వరిష్ఠ సాధువుల నిర్ణయం ప్రకారం సంఘంలోని ఏ శాఖకైనా వెళ్ళడానికి మీరు సిద్ధంగా ఉండాలి.

**31.** నేను విదేశాలలో ప్రచారం చేసేందుకు అవకాశం లభిస్తుందా?

లభించవచ్చు లేదా లభించకపోవచ్చు. ప్రధాన కార్యాలయంలోని వరిష్ఠ సన్న్యాసులు అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుని, ఎవరిని విదేశాలకు పంపించాలో నిర్ణయిస్తారు.

వ్యక్తిగత అభిప్రాయాలను మరియు ఇష్టాయిష్టాలను విడిచిపెట్టి, భగవంతునిపట్ల శరణాగతి భావనతో సంఘంలో చేరడం ఉత్తమం.

**32.** సన్న్యాస జీవితం గురించి మరియు రామకృష్ణ సంఘం గురించి సమగ్రంగా తెలుసుకోవడానికి మరేదైనా పుస్తకాన్ని సూచిస్తారా?

ఇంతకుముందు పదవ ప్రశ్నకు ఇచ్చిన సమాధానంలో చెప్పిన పుస్తకాలు సరిపోతాయి. ఇంకా కావాలనుకుంటే ఈ క్రింది రెండు పుస్తకాలను చదవవచ్చు.

* *The Glory of Monastic Life* : By Swami Bhajanananda

* *Monasticism – Ideal and Traditions*: A *Vedanta Kesari* Presentation

**33.** ఒకవేళ నేను సంఘంలో ఉండలేకపోతే, వెళ్ళిపోవచ్చా?

వెళ్ళిపోవచ్చు. మీ సన్న్యాస జీవితంలో ఏ సమయంలోనైనా మీరు సంఘాన్ని వదిలి వెళ్ళిపోవచ్చు. ప్రజలు ఈ జీవితాన్ని స్వచ్ఛందంగానే స్వీకరిస్తారు, అదేవిధంగా బయటకు కూడా వెళ్ళవచ్చు. ఈ విషయంలో ఇరువైపులా ఎటువంటి చట్టపరమైన లేదా ఆర్థికపరమైన బాధ్యతలకు తావు ఉండదు. సంఘాన్ని విడిచిపెట్టడం మీ ఆధ్యాత్మిక ప్రయాణానికి ముగింపు కాదు. మీరు ఎక్కడ ఉన్నా వాటిని కొనసాగిస్తారు.

**34.** మంచిది, నా ప్రశ్నలన్నిటికీ సమాధానాలు వచ్చాయి. కానీ, నేను సంఘంలో చేరాలా లేక కుటుంబంలో సాధారణ జీవితాన్ని గడపాలా అనే సందిగ్ధంలో ఉన్నాను. నాకు సహాయం చేయగలరా?

ఇది మీరు మాత్రమే నిర్ణయించుకోవాల్సిన విషయం. అసలు మీ నిజమైన ఆసక్తి దేనిపై ఉందో తెలుసుకోవడానికి మీ మనసును నిశితంగా గమనించండి. మీ మనస్సు దృఢమవ్వాలనీ, స్థిరత్వాన్ని పొందాలనీ నిజాయితీగా భగవంతుణ్ణి ప్రార్థించండి. వివేకవంతులైన వారిని సంప్రతించి, ఈ విషయంలో వారి సలహా తీసుకోవచ్చు. కానీ, తుది నిర్ణయం మాత్రం మీ అంతరాత్మ నుంచే రావాలి.